# వ్యాపార దక్షత

''ఏమోయ్ రామా, ఆమధ్య ఏదో వ్యాపారం చేస్తాను- చురుకైన కుర్రాడు తోడుగా వుంటే బావుంటుందన్నావుగా, ఇదిగో ఈ కుర్రాడిని చూడు'' అన్నాడు చంద్రం.

''అబ్బే లాభం లేదు'' అనుకుంటూ వెళ్ళిపోయాడు రాము.

మరో నాలుగు రోజుల తర్వాత మరో కుర్రాడిని చూపించాడు చంద్రం. ''అబ్బే ఇతనూ లాభం లేదు. సన్నగా రివటలా ఉంతపాడుగ్గా ఉన్నవాడు బిజినెస్‌కి ఏం పనికి వస్తాడు ఏమనుకోకు చంద్రం, ఇతనూ వద్దు'' అన్నాడు రాము.

ఇంతలో కనకయ్య ఎదురయ్యి, ''చూడు రామూ! వ్యాపారానికి కుర్రాడు కావాలన్నావు కదా, మా చుట్టాలబ్బాయి ఒకడున్నాడు. దగ్గర దగ్గర ఇర్వై సంవత్సరాలుంటాయి, పనికివస్తాడేమో చూసుకో'' అన్నాడు కనకయ్య.

అతనూ నచ్చలేదు రామూనికి.

ఆ కనకయ్యే పాపం, రాముకి సహాయం చేద్దామనే ఉద్దేశ్యంతో మరో అబ్బాయిని చూపించాడు. ఈసారి కూడా 'సారీ' అనేసాడు రాము.

పోనీ చిన్న ఆడపిల్లను చూడమంటావా అన్నాడు కనకయ్య ''బాబోయ్ ఆడపిల్లే'' అన్నాడు, రాము అదేదో ఆటంబాబు అన్న మాట విన్నంత భయంగా.

చివరికి ఎలాగైతేనేం రాము తనకు తానే ఒక కుర్రాడిని వెతికి పట్టుకున్నాడు. ఆ అబ్బాయి పొట్టిగా మరుగుజ్జులా ఉన్నాడు. ఆ అబ్బాయిని చూసి అందరూ రామూ బిజినెస్‌కి ఈ మరుగుజ్జు ఏం పనికొస్తాడు, అనుకున్నారు. కాని వారికి తెలియని విషయం ఒక్కటే, రాము చేసేది పూలవ్యాపారం. దానికి చిన్న చేతులున్నవాడైతే మూర కొలిచేటప్పుడు తక్కువ పడుతుంది. అదే పొడుగు కుర్రాళ్ళయితే మరీ ఎక్కువ కొలుస్తారు. ఆడవాళ్ళయితే తల్లో పూలు పెట్టుకోడానికి ఆశపడతారని రాము ఉద్దేశ్యం.

**-శ్రీమతి జి. కస్తూరిప్రసాద్**
(కాకినాడ)

# బానిసకో బానిస

''రాంబాబూ..రాంబాబూ!''

బాస్ పిలుపు బాంబు పేలినట్లు వినిపించడంతో గుండెలు అదిరి, పరుగున వెళ్ళాడు రాంబాబు.

''ఏం చెవిలో చెట్లు మొలిచాయా? పిలవగానే రావాలని తెలీదూ? ఈసారి పిలవగానే రాకపోయావో, అండమాన్ నికోబార్ దీవులకి, అక్కడ మన బ్రాంచి లేకపోయినా... క్రొత్తది పెట్టించి మరీ నిన్ను ట్రాన్స్‌ఫర్ చేయిస్తా..ఆ ''

బాస్ నరసింహం శివాలెత్తినట్లు ఎగిరిపడ్డాడు.

''చిత్తం సార్!'' అన్నాడు రాంబాబు వణికిపోతూ.

''అంటే! ఈసారి కూడా పిలవగానే రాకుండా, ఆలస్యంగానే వస్తానన్నమాట! బోడి నిన్ను ట్రాన్స్‌ఫర్ చేయించడం కోసం లక్షలు పోసి ఆ అండమాన్ నికోబార్ దీవుల్లో మన బ్రాంచి పెట్టించాలన్నమాట. అంతేనా? ..''

మళ్ళీ ఊగిపోవడం మొదలుపెట్టాడు నరసింహం.

మళ్ళీ ఏం మాట్లాడితే ఏం ముంచుకొస్తుందో తెలీక నిలబడిపోయాడలాగే రాంబాబు.

''ఏంటది బెల్లంకొట్టిన రాయిలా ఉలుకూ, పలుకూ లేకుండా వుండిపోయావ్? సెక్షన్ టూ నుంచి అర్జెంటు ఫైలుంది పట్రా. ఇదిగో ఈ ఫైల్ సెక్షన్ ఫోర్‌లో ఆ అప్పారావుకిచ్చిరా.''

''అలాగే సార్!'' అని, ఆ ఫైలు తీసుకొని బ్రతుకు జీవుడా అని బయటపడి, అర నిమిషంలో రాకెట్టులా సెక్షన్ టూలోని అర్జెంట్ ఫైల్‌తో అక్కడకొచ్చి పడ్డాడు రాంబాబు.

అయితే, ఈలోపు నరసింహం అతన్ని ''రాంబాబు..రాంబాబూ'' అంటూ రెండుసార్లు పిలిచాడు మళ్ళీ.

''నీ వాలకం చూస్తుంటే మన కంపెనీ బ్రాంచి ఆ అండమాన్ నికోబార్ దీవుల్లో పెట్టించేటట్టే వుంది. ఒక ఫైలు తీసుకెళ్ళిచ్చి, ఇంకో ఫైలు తీసుకురావడానికి ఇంతలేటా?''

విరుచుకుపడ్డాడు రాంబాబు మీద బాస్ నరసింహం.

పిచ్చెక్కి, జుట్టు పీక్కోవడం ఒకటే తరువాయిగా వుంది రాంబాబు పరిస్థితి.

ఇలా ఈ ఒక్కరోజే కాదు, ప్రతిరోజూ ఇదే తంతు.

## బానిసకో బానిస

'వెధవది బానిస బ్రతుకయిపోయింది' గొణుక్కున్నాడు రాంబాబు.

★★★

''ఏమేవ్..ఏమేవ్..''

రాంబాబు పిలుపునకు అదిరిపడి వంట గది లోంచి పరుగున వచ్చింది. సావిత్రి.

''ఏమే! చెవిలో చెట్లు మొలిచాయా? పిలవగానే గానే పలకాలని తెలీదూ? నాకంటే ఎక్కువ చదువుకున్నావనే కదా నీ పొగరు? నీవెక్కువ చదువుకున్నా నువ్వు నా పెళ్ళానివన్న సంగతి తెలుసుకో.. ఆ.. వెధవ్వేషాలేస్తే పుట్టింటికి పర్మినెంటుగా వెళ్ళిపోతావ్.. జాగ్రత్త?''

ఇల్లాం మీద ఒంటికాలి మీద ఎగిరాడు రాంబాబు.

మౌనంగా నిల్చుండిపోయింది సావిత్రి. అది నచ్చలేదు అతనికి.

'అంటే .. ఏమిటే నీ ఉద్దేశ్యం? పుట్టింటికి పంపుకుంటే పంపుకో, నాకేం? నేను ఎంచక్కా వెళ్ళిస్తానని అనుకుంటున్నావా? లేకపోతే ఈ అటెండర్ మొగుడు వదిలేస్తే, ఏ ఆఫీసరు మొగుడ్నో వెదుక్కుందామని ఆలోచిస్తున్నావా? ఊ .. చెప్పవే..చెప్పు..''

ప్రతీరోజూ ఇదే తంతయిపోవడం వల్ల సావిత్రిలో సహనం నశించిపోతోంది. భార్యంటే భరించునది అనుకుంటున్నాడేమో?! అయినా ఎంత కాలం?

ఆఫీసులో బాస్ దగ్గర బానిసలా పనిచేసే మొగుడు కాస్తా ఇంటికొచ్చాక తనని బానిసకంటే హీనంగా చూడ్డం ఆమె భరించలేకపోతోంది.

''అతను బానిసైతే... తను బానిసకు బానిసన్నమాట! ఎంత అన్యాయం?!'' అనుకుంది.

సావిత్రి ఇంకా మౌనంగానే వుండడాన్ని రాంబాబు తట్టుకోలేకపోతున్నాడు. ఎవరిమీదో తెలీని కోపాన్ని, అసహనాన్ని భార్యమీద ప్రదర్శించడానికి అలవాటుపడ్డ అతను కల్లుతాగిన కోతయిపోయాడు.

''అస్సలు నీ ఉద్దేశ్యమేమిటో చెప్పవే.. చెప్పు..'' అన్నాడు ఆమె మీదకు కుప్పించి, లంఘిస్తూ.

చెప్పు తీసింది సావిత్రి.

ఉలిక్కిపడ్డాడు రాంబాబు.

''ఏమిటది?'' అన్నాడు భయం భయంగా.

''చెప్పు..చెప్పు.. అంటున్నావుగా- అందుకే తీసాను. భార్యంటే బానిసనుకుంటున్నావేమో?! ఖబడ్దార్. ఆఫీసులో నువ్వు జీతం తీసుకుంటున్నావు కనుక ఎన్నియినా పడాలి. కానీ, నేనిక్కడ జీతం, భత్యం లేని నౌఖర్ని. అంతేకాదు, నీ జీవిత భాగస్వామిని. నన్ను తక్కువ చేసి మాట్లాడితే నీ బతుకే తుక్కురేగిపోద్ది.. ఆలోచించుకో..''

స్పృహ తప్పి, రాంబాబు ఇప్పుడు బాంబు తగిలినట్టే కూలిపోయాడు!

పూర్ ఫెలో!

**-యన్.కె. నాగేశ్వరరావు**
(పెనుగొండ)